పశువులకు ముద్దచర్మ వ్యాధి ముప్పు

- గుంతకల్లు మండలంలోని నరసాపురంలో రైతు నాగన్నకు నాలుగు పాడి ఆవులు న్నాయి. ఇటీవల ఓ ఆవుకు ముద్ద చర్మ వ్యాధి లక్షణాలు కనిపించాయి. పాల దిగుబడి తగ్గడంతో పాటు ఆవు అనారోగ్యానికి గురవడంతో రైతు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.
- గుర్రబ్బాడు గ్రామంలో రైతు రామాంజనేయులుకు ఓ జత ఎద్దులున్నాయి. అందులో ఒక ఎద్దుకు ముద్దచర్మవ్యాధి లక్షణాలు కనిపించడంతో రైతు వెంటనే పశువైద్యుడిని సంప్రదించాడు. ఆయన వెంటనే జీవాలకు టీకాలు వేశారు.

- దూడలపై మరింత ప్రభావం..
- టీకా వేయించకపోతే ప్రాణాపాయం
- పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న వ్యవసాయాధికారులు



ముద్ద చర్మ వ్యాధి బారిన పడిన ఆవు, దూడ

గుంతకల్లు రూరల్: పశువులకు ముద్ద చర్మ వ్యాపిస్తుండడంతో పాడి రైతులకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తోంది. ఏటా సెప్టెంబర్– డిసెంబర్ నెలల మధ్య మాత్రమే వ్యాపించే ఈ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని నాగసముద్రం పశువైద్యాధికారి డాక్టర్ మహేష్ సూచిస్తున్నారు. తెల్ల పశువులు అయిన ఆవులు, ఎద్దుల్లో ఎక్కువగా కనిపించే ఈ వ్యాధి తీవ్రత బర్రెల్లో కాస్త తక్కువగా ఉంటుంది. లంపి స్కిన్ డిసీజ్ అనే వైరస్ వల్ల కలిగే ఈ వ్యాధి పశువుల రక్తం పీల్చే దోమలు, ఈగలు, పిడుదల ద్వారా ఒక పశువు నుంచి మరో పశువుకు సులభంగా వ్యాపిస్తుంది. ప్రతి ఏడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ నెలల మధ్యనే ఈ వ్యాధి బయటపడుతుంది. ఈ వ్యాధి నివారణకు పశువైద్య శాఖ సిబ్బంది ఆగస్టు నెలలోనే వ్యాధి నిరోధక టీకాలను అందించే కార్యక్రమం చేపట్టారు. పశు సంవర్ధక శాఖ అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఈ వ్యాధి ముందుగా దూడలకు వ్యాపించి, వృద్ధి చెందుతుంది. వ్యాధి తీవ్రత ఉండే నాలుగు నెలల పాటు పాడ రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యనిపుణులు సూచిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

ముద్దచర్మ వ్యాధి బారిన పడిన పశువుల్లో 104 డిగ్రీల నుంచి 106 డిగ్రీల జ్వరం ఉంటుంది. చర్మంపై బొబ్బలు, బుడిపెలు, పొక్కులు ఏర్పడుతాయి. నెమ్మదిగా అవి పగిలి పుండ్లుగా మారుతాయి. బుడిపెలు ఎక్కువగా తల, మెడ, పొదుగుతోపాటు చర్మం పలుచగా ఉండే ఇతర ప్రాంతాల్లో వస్తాయి. మేత సరిగా తినకపోవడం, నోరు, ముక్కు నుండి చొంగ కారడం, పాల దిగుబడి తగ్గిపోవడం, అలసటగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గర్లోని పశువైద్యుడిని సంప్రదించాలి. నివారణకు సులభంగా జీర్ణమయ్యే గంజి లాంటి ఆహార పదార్థాలతో కొద్దిగా ఉప్పు కలిపి పశువులకు తాగించాలి. జ్వరం తీవ్రత తగ్గే వరకూ ఓఆర్ఎస్ ద్రావణాన్ని క్రమం తప్పకుండా తాగించాలి. జ్వరం తగ్గడానికి మెలోక్సికామ్ అనాల్జిన్ మందులను వైద్యుల సూచన మేరకు వాడాలి. సెకెండరీ బ్యాక్టీరియల్ ఎన్ఫెక్షన్ ఉన్నట్‌లైతే యాంటి బయాటిక్, న్యుమోనియా లక్షణాలు ఉన్నట్‌లైతే అవిల్, సీపీఎం వంటి మందులను వాడాలి.

ప్రత్యేక దృష్టి సారించాలి



వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరుచేసి చికిత్స అందించాలి. పశువుల పాకలో దోమల బెడత లేకుండా ఉండటానికి దోమతెరలు లేదా వేపాకు పొగ వేయాలి. వ్యాధి నివారణకు ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో జీవాలకు టీకాలు వేశాం. అయినా ముద్దచర్మ వ్యాధి సోకితే పశువులకు టీకా వేయించాలి.

– మహేష్, మండల పశువైద్యాధికారి

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి


పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గుంతకల్లు: విజయనగరంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించే 49వ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మహాసభల పోస్టర్లును విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. యువగళం పేరుతో నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై విజయనగరంలో జరుగుతున్న మహాసభలో నాయకులు నాలుగు రోజులు పాటు చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు రోహిత్, సమీర్, లక్ష్మణ్, మహిళ నాయకురాళ్లు రెహానా, కరిష్మా, లత, సరళ తదితరులు పాల్గొన్నారు.

కనకదాస జయంతికి తరలిరండి


మాట్లాడుతున్న కురుబ సంఘం నాయకులు

గుంతకల్లు: అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఈ నెల 18న నిర్వహించే భక్త కనకదాస జయంతి ఉత్సవాలకు కురబలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కె.సోమశేఖర్, కురుబ సాధికారిక జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ కోరారు. శనివారం స్థానిక బీరప్ప గుడిలో పట్టణ కురుబ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జయంతి కార్యక్రమానికి నియోజకవర్గంలోని కురుబలు 18వ తేదీ ఉదయం గుంతకల్లులోని బీరప్పగుడి వద్దకు చేరుకోవాలన్నారు. ఇక్కడ నుంచి అనంతపురానికి భారీ కాన్వాయ్‌తో బయలుదేరతామన్నారు. అలాగే ఈ నెల 24న గుంతకల్లులో కనకదాస విగ్రహావిష్కరణతోపాటు జయంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాలకు జిల్లా మంత్రి, ఎంపీలు తదితరులు హాజరవుతారన్నారు. జిల్లాలోని కురుబలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు పూజారి మందాలప్ప, జెడ్పీటీసీ కదిరప్ప, కే.శివప్ప, పాల మల్లికార్జున, కనకటీ రామప్ప, కే.సాంబశివ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్ ..మద్దిలేటి


మద్దిలేటి అందిస్తున్న తినుబండారాలు తింటున్న వానరాలు

యాడికి: వానరాల ఆకలి తీరుస్తూ మద్దిలేటి అనే వ్యక్తి శభాష్ అనిపించుకుంటున్నాడు. మండల లోని కోనుప్పలపాడు గ్రామ సమీపంలోని కోన క్షేత్రంలో గల రామలింగేశ్వరుని సన్నిధి, వందల ఏళ్లనాటి మర్రి వృక్షం, కోన జలపాతం, మారడమ్మ జలపాతాల వద్ద వందల సంఖ్యలో వానరాలుంటున్నాయి. సమయానికి ఆహారం దొరక్క అలమటిస్తుంటాయి. మండల కేంద్రంలో కొండ కింద వీధిలో నివసిస్తున్న బేల్దారి మద్దిలేటి వాటిని చూసి చలించిపోయాడు. వారంలో 2 రోజుల పాటు దాదాపు రూ.2,500 విలువ గల బిస్కెట్లు, పండ్లు, ఇతర తినుబండరాలు అందిస్తూ వాటి ఆకలి తీరుస్తున్నాడు. ఇది చూసిన పలువురు ప్రకృతి ప్రేమికులు శభాష్.. మద్దిలేటి అంటూ అభినందిస్తున్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు


గుత్తి ఆర్ఎస్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు


పుట్లూరు మండలం శనగలగూడూరులో..


తాడిపత్రి మండలం యుగుడూరులో నాకాబందీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి/పుట్లూరు/తాడిపత్రి రూరల్/పెద్దవడుగూరు: గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గుత్తి ఆర్ఎస్‌లోని హోరబ్ చర్చి, బండి మోటు వీధి తదితర ప్రాంతాల్లో పోలీసులు శనివారం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. అనుమానితులు, ట్రబుల్ మాంగర్స్, రైడీ షీటర్ల ఇళ్లలో సోదాలు చేశారు. అందరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలని, అల్లర్లకు, గొడవలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని సీఐ, ఎస్ఐ హెచ్చరించారు. అలాగే పుట్లూరు మండలంలోని శనగలగూడూరు గ్రామంలో శనివారం సీఐ సత్యబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. గ్రామంలోని అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశారు. కార్యక్రమంలో యల్లనూరు ఎస్ఐ రాంప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు. అదేవిధంగా తాడిపత్రి మండలంలోని యుగుడూరు గ్రామంలో శనివారం అప్‌గ్రేడ్ ఎస్ఐలు ధరణిబాబు, కాటయ్య, సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. గ్రామంలోని రెండు వర్గాలకు చెందిన ఇళ్లు, గడ్డివాములు, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అలాగే పెద్దవడుగూరు మండలంలోని చిన్నవడుగూరులో శనివారం ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ ఇమ్రాన్‌ను అభినందిస్తున్న గేట్స్ కళాశాల యాజమాన్యం

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలోని ఎంబీఏ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎస్‌కె మహమ్మద్ ఇమ్రాన్‌కు జేఎన్‌టీయూ యూనివర్శిటీ శనివారం డాక్టరేట్ ప్రదానం చేసింది. మహమ్మద్ ఇమ్రాన్ స్టాక్ మార్కెట్ కార్పొరేట్ యాక్షన్ అనే అంశంపై పరిశోధించి డెవిడెండ్, బోనస్ ఇష్యూ, షేర్ల బై బ్యాక్ ప్రభావం స్టాక్ ఎక్స్చేంజ్‌లోని కంపెనీలకు సంబంధించిన షేర్ ధరల ప్రభావంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. దీంతో మహమ్మద్ ఇమ్రాన్‌కు జేఎన్‌టీయూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా అతడిని గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వీకే వాణి, ఎండి రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ అభినందించారు.

ఇంటిపై కూలిన విద్యుత్ స్తంభం


గుత్తి ఆర్ఎస్‌లో కూలిన విద్యుత్ స్తంభం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రామాలయం వీధిలో శనివారం షబానా అనే మహిళ ఇంటిపై విద్యుత్ స్తంభం కూలింది. అదృష్టవశాత్తు తృటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. రామాలయం వీధిలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ విషయాన్ని కాలనీవాసులు విద్యుత్ అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో శిథిలావస్థలో ఉన్న ఓ విద్యుత్ స్తంభం ఇంటిపై కూలింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇంట్లో ఎవరైనా ఉండి ఉంటే ప్రాణాపాయం జరిగి ఉండేది స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కాలువ పరిశీలన


కొండుగారికుంట వద్ద కాలువ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ గుత్తా కేశవనాయుడు

పుట్లూరు: మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి యల్లనూరు మండలం బొప్పేపల్లి చెరువుకు నీరు సరఫరా చేయడానికి కాలువ ఏర్పాటు ప్రదేశాన్ని శనివారం ఆర్డీఓ గుత్తా కేశవనాయుడు పరిశీలించారు. సుబ్బరాయసాగర్ 29వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా బొప్పేపల్లి చెరువుకు నీరు సరఫరా కావడానికి కుమ్మనమల వరకు కాలువ ఉండగా అక్కడి నుంచి వంక ప్రాంతం ద్వారా నీరు సరఫరా అవుతోంది. అయితే పలు చోట్ల పట్టా భూములు ఉండటంతో .. వాటిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. బొప్పేపల్లి చెరువుకు నీటి సరఫరా కావడానికి ఎలాంటి అటంకాలు లేకుండా ఉండేలా కాలువ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ శేషారెడ్డి, సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

తెగుళ్లపై అవగాహన


ఎండు తెగులుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మహబూబ్‌బాషా

యాడికి: ఎండ తెగులు సోకిన పప్పుశనగ పంటకు ప్రొపి కొనపాల్ లేదా టూబి కొనజోల్ లీటరు నీటిలో 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేస్తే వ్యాధిని అరికట్టవచ్చని మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా సూచించారు. శనివారం మండలంలోని నిట్టూరు, కొత్తపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పప్పుశనగ పంటను ఏఓ పరిశీలించారు. తెగులు నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి రమేష్, రైతులు పాల్గొన్నారు.

డ్రిప్పు సామగ్రి అపహరణ

బుక్కరాయసముద్రం: మండలంలోని ఏడావులపర్తిలో రైతు జయరామిరెడ్డి పొలంలో గుర్తు తెలియని వ్యక్తుల డ్రిప్పు పరికరాలను ఎత్తుకెళ్లారు. బాధితుడి వివరాల మేరకు.. జయరామిరెడ్డి 13 ఎకరాల్లో డ్రిప్పు ద్వారా అరటి పంట సాగు చేశాడు. ఇటీవల పంట అయిపోయిన వెంటనే డ్రిప్పు వైరుకట్టలను పొలంలో గట్టుపై ఉంచారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డ్రిప్పు వైరును ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.2.50 లక్షలు విలువ ఉంటుందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


వీరారెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న తాడిపత్రి మలేరియా అధికారి శ్రీనివాసులు

యాడికి: ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడిపత్రి మలేరియా అధికారి (ఎంఓ) శ్రీనివాసులు సూచించారు. మండలంలోని యాడికి పీహెచ్‌సీ పరిధిలోని వీరారెడ్డిపల్లిలో శనివారం ఆయన పర్యటించారు. గ్రామంలో చేపట్టిన దోమల మందు పిచికారీని పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, రాత్రిపూట దోమతెరలు వాడాలన్నారు. ఇంటా, బయట తప్పనిసరిగా దోమల మందు పిచికారీ చేయించుకోవాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మలేరియా కేసులు నమోదు కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏఎన్ఎం జీనత్, ఎంఎల్‌హెచ్‌పీ భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్త శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ధాబాలు, రెస్టారెంట్లలో మద్యం విక్రయిస్తే చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ రామకృష్ణుడు

తాడిపత్రి రూరల్/యాడికి: రెస్టారెంట్లు, ధాబాల్లో మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామకృష్ణుడు హెచ్చరించారు. తాడిపత్రిఅప్‌గ్రేడ్ రూరల్ పోలీసు స్టేషన్‌లో శనివారం డాబా యజమానులతో సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ రెస్టారెంట్లు, ధాబాల్లో మద్యం విక్రయించడం, సేవింపచేయడం నేరమన్నారు. మద్యం తాగేవారిని అనుమతించరాదన్నారు. ఈ మేరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు సీసీ కెమెరాలను అమర్చాలని ఆదేశించారు. పట్టణ, అప్‌గ్రేడ్ సీఐలు సాయిప్రతాప్, శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే యాడికి పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ధాబా యజమానులతో సీఐ ఈరన్న సమావేశమయ్యారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన పెంచాలి


మాట్లాడుతున్న ఏడీజే శ్రీహరి

గుత్తి: న్యాయం, చట్టాలపై ప్రజలకు అవగాహన పెంచాలని ఏడీజే శ్రీహరి న్యాయవాదులకు సూచించారు. గుత్తి పట్టణంలోని ఏడీజే కోర్టు హాల్‌లో శనివారం మండల న్యాయ సేవా సమితి చైర్మన్, ఏడీజే ఆధ్వర్యంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారితో కలసి ఏడీజే మాట్లాడారు. న్యాయం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశమున్న కేసులన్నింటినీ పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు, పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి కోర్టు సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ సూపరింటెండెంట్ మునెమ్మ, గీత వరలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాం శర్మ, వైస్ ప్రెసిడెంట్ పీడీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరు కరపత్రాల విడుదల

గుత్తి: గుత్తి మున్సిపాలిటీలో పాటు మండల వ్యాప్తంగా సీపీఎం తలపెట్టిన ప్రజాపోరు కరపత్రాలను శనివారం విడుదల చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మండల కార్యదర్శి నిర్మల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రజాపోరు కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 14 వరకూ ప్రజా పోరు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండల కమిటీ సభ్యులు మల్లికార్జున, ఫిరోజ్, మద్దిలేటి, రేవతి, కవిత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన


శిక్షణ ఇస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక భాగ్యనగర్‌లోని యూపీఎంసీ ఆరోగ్య కేంద్రంలో శనివారం క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం అనే అవగాహన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై వైద్యులు అరుణ, డాక్టర్ హరిత శిక్షణ ఇచ్చారు. అనంతరం డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా పరీక్షలు నిర్వహించడానికి మీ ఇంటి వద్దకే ఏఎన్ఎం, ఆశ వర్కర్లు వస్తారన్నారు. ఈ నెల 11న కార్యక్రమం ప్రారంభమైతుందని, ప్రతిఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'విద్యుత్ చార్జీలను తగ్గించాలి'

గుంతకల్లు: విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచబోమంటూనే ట్రా అప్ చార్జీల పేరుతో పేద ప్రజలపై అదనపు భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. దీంతో ప్రజలపై దాదాపు రూ.17వేల కోట్ల భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీలతో 40 శాతం అధికంగా వసూళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిమ్మారెడ్డి, గాలిమల్లికార్జున, ఆలంనవాజ్, గుల్‌ఫురోష్, ఖాదర్‌వలి, రహంతుల్లా, నబీరసూల్, చంద్ర, కుళ్లాయి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేస్త్రీపై దాడి

తాడిపత్రి రూరల్: మండలంలోని వెలమకూరు గ్రామంలో శనివారం మేస్త్రీ షేకన్నపై ఇంటి యజమాని రాము దాడి చేశాడని పోలీసులు తెలిపారు. వజ్రకరూరు మండలం కొనకండ్లకు చెందిన షేకన్నతో ఇంటి నిర్మాణం విషయంలో మనస్పర్థలు రావడంతో దాడి చేశాడు. గాయపడ్డ మేస్త్రీని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడిని భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

గొర్రెకు సిజేరియన్

శింగనమల: శింగనమల వెటర్నరీ ఆస్పత్రిలో గొర్రెకు సిజేరియన్ శస్త్ర చికిత్స చేశామని వెటర్నరీ సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభం తెలిపారు. శింగనమలలోని అఖిలాష్‌కు చెందిన గొర్రె ఈనలేక పోవడంతో ఆస్పత్రికి తీసుకువచ్చారు. సిజేరియన్ శస్త్ర చికిత్స చేసి, చనిపోయిన పిల్లను బయటకు తీసి వేసి గొర్రెను కాపాడారు. శస్త్ర చికిత్స నిర్వహణలో వైద్య సిబ్బంది రజి యా బేగం, రంగనాయకమ్మ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

శింగనమల: మండలంలోని పెరవలి వంక నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను శనివారం తెల్లవారుజామున నాయనపల్లిక్రాస్‌లో పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టమాటకు బీమా సౌకర్యం

శింగనమల/బుక్కరాయసముద్రం: రబీలో టమాట పంట సాగు చేసే రైతులు వాతావరణ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి శైలజ సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ టమాట పంట సాగు చేసే రైతులు ఈ–క్రాప్ నమోదుతో పాటు, ఎకరాకు రూ.1600 ప్రకారం డిసెంబర్ 15 లోపు చెల్లిస్తే, పంట నష్టం జరిగినప్పుడు రూ.32 వేలు బీమా పొందవచ్చన్నారు. వివరాలకు ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా మేనేజర్ కృష్ణ (9912275799)ను సంప్రదించాలన్నారు.

దాడిపై కేసు నమోదు

పామిడి: పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన బోయ శ్రీకాంత్‌పై అదే వీధికి చెందిన రౌడీషీటర్ బోయ అశోక్ అండ్ కో దాడికి సంబంధించి కేసు నమోదు చేసినట్లు సీఐ యుగంధర్ శనివారం తెలిపారు. గత శుక్రవారం సాయంత్రం స్థానిక కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న బోయ శ్రీకాంత్‌పై రౌడీషీటర్ బోయ అశోక్ బృందం గన్, కొడవలి వంటి మారణాయుధాలతో ముక్కుమ్మడిగా దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రౌడీషీటర్ బోయ అశోక్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మట్కాబీటర్ అరెస్టు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో మట్కా బీటర్ ప్రతాప్‌ను అరెస్టు చేసి, రూ.40 వేలు స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్ రెడ్డి శనివారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

మహిళా సంఘాల ఆందోళన

పామిడి: పట్టణంలోని మెప్మా కార్యాలయమైన భవితాకేంద్రం వద్ద శనివారం మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చేపట్టారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)కు సంబంధించి 485 మహిళా సంఘాలకు గాను 4892 మంది సభ్యులు ఉన్నారన్నారు. రెండు నెలల క్రితం మెప్మా అధికారి చంద్రశేఖర్‌ను గుత్తికి బదిలీ చేశారు. అప్పటి నుంచి సంఘాల బ్యాంకు ఆర్థిక లావాదేవీలు స్తంభించాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

మాజీ సర్పంచ్ కుమారుడిపై దాడి

గుంతకల్లు రూరల్: మొలకలపెంట మాజీ సర్పంచ్ మొలగవెళ్లి రంగమ్మ కుమారుడు జయుడుపై శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన కొంతమంది దాడిచేశారు. కసాపురం ఎస్ఐ వెంకటస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో జయుడు మొలకలపెంట– కసాపురం రహదారిలో గాయాలతో పడి ఉన్నాడు. అక్కడి నుంచే కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తనను కొందరు కొట్టి పడేశారని సమాచారమందించాడు. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని జయుడిని గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు, దివాకర్‌తోపాటు సూర్యనారాయణ, తిక్కస్వామి, ఉదయ్ తనపై దాడి చేసి గాయపరిచారని జయుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణం

తాడిపత్రి రూరల్: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి రైలుకిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన నారాయణ స్వామి(52), అనసూయ దంపతులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరగడం, వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో శుక్రవారం రాత్రి యల్లనూరు రోడ్డు రైల్వేగేటు సమీపంలో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

లారీ, ట్యాంకర్ ఢీ

శింగనమల: మండలంలోని నాయనపల్లిక్రాస్ సమీపంలో శనివారం సాయంత్రం లారీ, ట్యాంకర్ ఢీకొని ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు తగిలినట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు. తాడిపత్రి నుంచి వస్తున్న లారీ, అనంతపురం వస్తున్న ఖాళీ ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాయపడిన డ్రైవర్‌ను108లో అనంతపురానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా స్వాధీనం.. నిందితుడి అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో శనివారం మోటర్ సైకిల్‌పై నాటుసారా తరలిస్తున్న కంబగిరి అనే వ్యక్తిని అరెస్టు చేసి 8.8 లీటర్ల నాటుసారాతో పాటు మోటర్‌సైకిల్‌ను సీజ్ చేశామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. నంద్యాల జిల్లా బూర్గుల గ్రామానికి చెందిన నిందితుడు తాడిపత్రికి నాటుసారా తీసుకెళ్తుండగా అరెస్టు చేశామన్నారు.